క్లుప్తంగా

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

పరిగి: హక్కుల సాధన కోసం ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి అన్నారు. సంఘం 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్‌లు నేటికీ అన్ని విధాల నష్టపోతున్నారని చెప్పారు. రాజకీయంగా, ఉద్యోగపరంగా, ఆర్థికంగా ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కావున కలిసికట్టుగా పోరాడి మన హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'



సీఐకి ఫిర్యాదు చేస్తున్న గౌడ సంఘం సభ్యులు

తాండూరు టౌన్: గౌడ సంక్షేమ సంఘం భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం పలువురు సంఘం సభ్యులు పట్టణ సీఐ రాజేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. 1985వ సంవత్సరంలో మల్‌రెడ్డిపల్లి శివారులో గల సర్వే 37/1 లో 2.16 ఎకరాల స్థలాన్ని సొసైటీ తరుపున 16 మంది కలిసి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆ భూమిని కాపాడాలని సంఘం సభ్యులు ప్రభాకర్ గౌడ్, ప్రసాద్ గౌడ్, బాల శంకర్, మధుసూదన్ గౌడ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏసీపీని కలిసిన నాయకులు



ఏసీపీ ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

చేవెళ్ల: చేవెళ్ల ఏసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌ను పలువురు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చేవెళ్ల ఏసీపీ కార్యాలయంలో ఆయన్ను సర్పంచ్ బండారి శైలజ, పీఏసీఎస్ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు వసంతం, రాములు, ఉప సర్పంచ్ గంగి యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి కలిసి శాలువాలతో సన్మానించారు. అనంతరం చేవెళ్ల సీపీఐ నాయకులు కూడా వెళ్లి ఆయను కలిసి సన్మానించారు. సీపీఐ నాయకులు కె. రామస్వామి, సత్తిరెడ్డి, సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, నర్సింహులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా బండమీది జాతర

నందిగామ: ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండల పరిధిలోని వెంకమ్మ గూడలో ప్రారంభమైన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆమె ఆదివారం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. ఏటా బండమీది జాతరగా పిలవబడే ఈ ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. వెంకమ్మగూడ పరిసర గ్రామాలతో పాటు షాబాద్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. ఇక్కడ మొక్కుకున్న మొక్కులు తీరుతాయనే భక్తుల్లో ప్రగాఢ నమ్మకం ఉందని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, సర్పంచ్ రజనీత, గ్రామస్తులు వీరేందర్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

నందిగామ: నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈదులపల్లి సర్పంచ్ స్వామి అన్నారు. మండల పరిధిలోని మోత్కులగూడలో ఆదివారం రేషన్ దుకాణాన్ని సర్పంచి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఈదులపల్లికి అనుబంధ గ్రామంగా ఉన్న మోత్కులగూడ గ్రామస్తులకు రేషన్ షాపు లేక సుమారు 2.5 కిలో మీటర్లు నడిచి ఈదులపల్లికి వెళ్లి రేషన్ సరుకులను తెచ్చుకునే వారని తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే మోత్కులగూడలో రేషన్ షాపును ఏర్పాటు చేయించారు. ఇప్పటి నుంచి మోత్కులగూడ గ్రామస్తులు తమ గ్రామంలోనే రేషన్ సరుకులు తీసుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నత్తనడకన 'డబుల్' నిర్మాణాలు

నిరుపేద కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించినా.. సకాలంలో నెరవేరడం లేదు. అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం వెరసి ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదు. పైగా నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలకు నిర్మాణదారులు తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణలు రావడంతో.. భవనాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

- మండలానికి 50 ఇండ్లు మంజూరు
- ఏళ్లు గడిచినా ముందుకు సాగని పనులు
- నాణ్యతా ప్రమాణాలు పట్టని కాంట్రాక్టర్లు!
- చోద్యం చూస్తున్న అధికారులు



దోమలో నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

దోమ: అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణపు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ ఇళ్లు కట్టించి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పి ఏళ్లు గడిచినా.. నిర్మాణాలు పూర్తి కావడం లేదు. దీంతో పేదోడి సొంతింటి కల నెరవేరేనా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలానికి రాష్ట్ర ప్రభుత్వం 50 ఇళ్లను మంజురు చేసింది. మంజూరు చేసిన ఇళ్లను సర్వే నంబర్ 100లోని 2.04 గుంటల ప్రభుత్వ భూమిలో రెండేళ్లగా నిర్మాణపు పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణంలో సగం ఇసుక, సగం డస్ట్ వాడాల్సి ఉండగా.. నిర్మాణదారులు పూర్తిగా డస్ట్‌ను వినియోగిస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత లోపించిందని లబ్ధిదారులు, స్థానికులు, మండల ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు.. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూంలను పరిశీలించి, పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎదురు చూస్తున్నాం



ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లు తమకు ఎప్పుడు కేటాయిస్తారోనని ఆశగా ఎదురుచూస్తున్నాను. తల్లితండ్రులను కోల్పోయిన తాము.. ఉండటానికి ఇళ్లు కూడా లేదు. బంధువుల వద్ద ఉంటున్నాము. అనాథలైన మాకు డబుల్‌బెడ్‌రూం ఇస్తే.. తమకు గూడు కల్పించినట్లవుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ స్థితిగతులను పరిశీలించి ఆదుకోవాలి.

– బి. వెంకటేశ్, బొంపల్లి

నాణ్యత పాటించాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే.. నిర్మాణదారులు నాణ్యత పాటించడం లేదు. ఇలా నిర్మిస్తే.. అవి మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతాయి. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని, నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలి.

– విజయ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత, దోమ

కాంట్రాక్టర్లకు నోటీసులు ఇస్తాం..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో ఇసుక వాడకపోతే కాంట్రాక్టర్లకు నోటీసులు అందజేస్తాం. పనుల్లో ఎలాంటి నాణ్యత లోపించినా చర్యలు తీసుకుంటాం. మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇళ్ల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. నాణ్యత పాటించేలా చర్యలు చేపడుతున్నాం. జూన్ చివరి నాటికి భవనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–మహేశ్, ఆర్అండ్‌బీ, ఏఈ

రైతులను అవమానించారు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఆర్

పరిగి: 'రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును తీసుకువచ్చింది. ఆ ప్రాజెక్టును రీడిజైన్ చేసి రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఇప్పుడు తాగునీటి అవసరాలకే అంటూ సుప్రీం కోర్టులో చెప్పి, రైతులను అవమానించారు' అని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కేవలం తాగునీటి కోసమే అని సుప్రీం కోర్టులో ప్రభుత్వం వాదనలు వినిపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎత్తిపోతల ద్వారా 12లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామని సీఎం కేసీఆర్ ఎన్నికల సభల్లో చెప్పారని, 90టీఎంసీ నీటి ద్వారా బీడు భూములను సశ్యాశామలంగా మారుస్తామని రైతులకు ఆశ చూపి ఇప్పుడు మాట మార్చారని విమర్శించారు.

మాట మార్చడం అలవాటే..

మాట మార్చడం సీఎం కేసీఆర్‌కు అలవాటేనని, కాని నమ్మి ఓట్లు వేసిన రైతులను మోసం చేయడమే అవుతుందని టీఆర్ఆర్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజల కోసం తెచ్చిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో గోదావరి నుంచి రావాల్సిన నీటిని రాకుండా చేశారని ఆరోపించారు. ఇప్పుడు మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలను ప్రభుత్వం ఎడారిగా మార్చేందుకు కుట్ర చేస్తుందని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెచ్చుకున్న తెలంగాణలో అన్యాయమే జరుగుతుందన్నారు. రైతుల పక్షాన పోరాటం చేస్తామని, వారికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, యుజన కాంగ్రెస్ నాయకులు జగన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో స్నేహభావం

బీజేపీ నాయకుడు కిరణ్‌కుమార్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వెంకటేశ్ తదితరులు

షాబాద్: గ్రామీణ క్రీడాకారులకు క్రీడాపోటీలు ఎంతో దోహదపడతాయని, ఆటల పోటీలతో స్నేహభావం పెంపొందుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఛత్రపతి శివాజీ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రీడలు నిజజీవితంలో భాగం చేసుకుంటే శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ వనిత, యువజన సంఘం నాయకులు మహేశ్, హరీశ్, శంకర్, రఘు, నగేష్, భాస్కర్, శ్రీహరి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

దోమ: మల్లన్న స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఊటుపల్లిలో ఏటా నిర్వహించే కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జెడ్పీటీసీ నాగిరెడ్డి, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి ఉత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీని శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, చాపలగూడెం సర్పంచి లక్ష్మణ్, లింగన్‌పల్లి, కొత్తపల్లి, మైలారం, దోర్నాల్‌పల్లి సర్పంచులు యాదయ్య సాగర్, బల్లరాణి వెంకటేశ్, రాములు, రాజు, ఊటుపల్లి మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్య, గ్రామస్తులు నారాయణ, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, జంగయ్య, సత్యనారాయణ, రాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంకల్‌లో.. అగ్నిగుండం

పూడూరు: కంకల్ వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం తెల్లవారు జామున నిర్వహించిన అగ్నిగుండంలో భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. 20న సోమవారం (నేడు) ఉదయం స్వామివారి రథోత్సవం, 21న మంగళవారం స్వామివారి కల్యాణ ఉత్సవాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



పరిగి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తదితరులు



కొడంగల్: కస్తూరుపల్లిలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

మతోన్మాద శక్తుల నుంచి హిందూ జాతిని కాపాడిన ఛత్రపతి శివాజీ అడుగుజాడల్లో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం ఛత్రపతి జయంతి సందర్భంగా ప్రజాసంఘాలు, రాజకీయ నేతలు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీగా ర్యాలీలు తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హిందూ సమాజం కోసం శివాజీ వీరోచిత పోరాటం చేశారని, కులమతబేధాలు లేకుండా సమాజస్థాపన కోసం పాటుపడిన మహనీయుడని కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



దోమ: బడేంపల్లిలో డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి



నవాబుపేట: ర్యాలీలో ఎమ్మెల్యే కాలె యాదయ్య



యాలాల: బాణాపూర్‌లో..

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రహ్లాదరావు

కుల్కచర్ల: అవినీతి రహిత పాలన అంతానికి బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్‌లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగులో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి, నియంతృత్వ పాలన కొనసాగుతుందని, ఆ పాలనకు చరమ గీతం పాడాలంటే.. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలు, నియంతృత్వ పోకడల గురించి ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అంజిలయ్య, ఎస్సీమోర్చా మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మోత్కుర్ సర్పంచ్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొడంగల్: మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు వెంకట్‌రెడ్డి, గోడల రాంరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంలోని శంభులింగేశ్వర దేవాలయంలో శనివారం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

అంతా మా ఇష్టం



ఇరుకుగా ఉన్న మహాశక్తి చౌరస్తాలో ఆర్టీసీ బస్సు

- బస్సుల దారి మళ్లిస్తున్న ఆర్టీసీ సిబ్బంది
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులు

వికారాబాద్ అర్బన్: పలానా రూట్లలో బస్సులు నడపాలని ఆర్టీసీ యాజమాన్యం.. సిబ్బందికి రోడ్డు మార్గంతో పాటు సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు ఇస్తూనే ఉంటుంది. పోలీసులు కూడా తగిన మార్గదర్శకాలు చేస్తూనే ఉంటారు. కానీ.. ఇవేమీ పట్టని డ్రైవర్లు అంతా మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తమకు నచ్చిన దారిలో బస్సులు తిప్పుతూ ప్రయాణికులను తిప్పలు పెడుతున్నారు. ఇరుకైన దారుల్లో నడుపుతూ ప్రజలకు ఇబ్బందిగా మారారు. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తాకు వచ్చే బస్సులను రైల్వే స్టేషన్ మీదుగా పోస్టాఫీస్, పాత గంజ్‌లోని కూరగాయల మార్కెట్ నుంచి మళ్లిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్ కూడలి నుంచి ఎంఆర్‌పీ వరకు వెళ్లి ఎన్టీఆర్ చౌరస్తాకు బస్సులు వెళ్లాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు, పోలీసులు పలుచోట్ల రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఆర్టీసీ సిబ్బంది ఆ నిబంధనలను పాటించకుండా అడ్డదారిన వస్తుండటంతో ప్రయాణికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామ మందిరం నుంచి మహాశక్తి చౌరస్తా వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు, రెండు వైపులా వ్యాపార సముదాయాలు ఎప్పుడు జనాలతో రద్దీగా ఉటాయి. అక్కడికి వచ్చే జనాలకు ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు స్థలం ఉండకపోగా, అదే రోడ్డులో బస్సుల రాకపోకలు మరింత సమస్య తెచ్చి పెడుతోంది. ప్రత్యేక, పండుగల సమయాల్లో రద్దీ గురించి చెప్పనక్కర్లేదు. రెండు పెద్ద వాహనాలు ఎదురు పడితే పక్కనుంచి కనీసం ద్విచక్ర వాహనం వెళ్లడానికి పది నిమిషాల సమయం పడుతుంది. అదే రోడ్డులో కొందరు పండ్లు, పూల వ్యాపారం రోడ్డు పక్కనే పెట్టడం మరింత సమస్య తెచ్చి పెడుతోంది. ఆయా వ్యాపార సముదాయాల ముందే పండ్ల బండ్లను పెట్టడంతో వ్యాపారులు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే పండ్ల వ్యాపారులు దాడులకు పాల్పడుతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు, పోలీసులు దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనుల గోస పట్టని ప్రభుత్వం



వాగుకు వరద రావటంతో నిలిచిన రాకపోకలు(ఫైల్)

- వరద వస్తే రాకపోకలు బంద్
- పదేళ్లుగా వంతెన కోసం స్థానికుల ఎదురుచూపు

పెద్దేముల్: 'వాన రాకడ.. ప్రాణం పోకడ అన్నట్లుగా ఉంది మా పరిస్థితి. వానలు పడటం మంచికే అయినా.. వాగులు, వంకలు పొంగిపొర్లీ మా దారుణివాగు తండాకు దారితెన్నులు లేకుండా చేస్తోంది. అయినా గిరిజనుల గోడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు' అని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిరాలు ఇలా ఉన్నాయి. చిన్న పాటి వాగు పారితే.. పెద్దేముల్ మండల దారుణివాగు తండాకు రాకపోకలు నిలిచిపోతాయి. గిరిజన వాసులు ఎటు వెళ్లాలన్న మరో దారి అనుకూలంగా లేదు. ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు తండా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వంతెనను మంజురు చేయాలని దశాబ్దకాలంగా ప్రభుత్వాలకు విన్న వించినా ఎలాంటి స్పందన లేదని హన్మాపూర్ మాజీ సర్పంచి నర్సింహులు ఆరోపించారు.

ఏడాదికి ఒక్కసారైనా రారు..

వర్షాలు పడి.. వాగు పారితే.. వాగు దాటలేని పరిస్థితని, మండల కేంద్రానికి రావాలన్నా పది కిలో మీటర్ల దూరం కాస్త.. తాండూరు నుంచి 30 కిల్లో మీటర్లకు పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. జైరాంతండాకు అనుబంధ గ్రామం దారుణివాగుతండా ఉండటంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏడాదికి ఒక్కసారి కూడా తండాకు రారని గిరిజనులు వాపోతున్నారు. తండాల్లో ఉన్న సమస్యలు ఎవరికి చెప్పినా లాభం లేదని, ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం అని చెప్పడమే తప్ప.. ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంతెనను మంజూరు చేయాలని తండా వాసులు కోరుతున్నారు.

వెంటనే స్పందించాలి



ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజనుల సమస్యలు తీర్చాలి. దారుణివాగుకు వంతెనను మంజూరు చేయాలి. ఈ విషయాన్ని గతంలో మండల సమావేశంలో గుర్తు చేశాం. అయినా అధికారులు స్పందించ లేదు. వెంటనే ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు స్పందించాలి.

– లొంక నీలు, ఎంపీటీసీ హన్మాపూర్

యువత క్రీడల్లో రాణించాలి

కొందుర్గు: క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా కొందుర్గు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 9వ రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందుర్గు ప్రాంతంలో యువత క్రీడలపై ఎంతో ఆసక్తి చూపుతుందన్నారు. ఇందుకు యువతను అభినందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, నాయకులు శ్రీశైలం, మనోహర్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి,యాదయ్య, నరేందర్, రాములుగౌడ్ పాల్గొన్నారు.